# ఆమె ఒక జాతిమనిషి

రచయిత:

ఆకుండి సత్యనారాయణ

[గతసంచికకు తరువాయి.]

వెనకటింటి పెరటితలుపు తెరిచేసరికి 'అది పెరడా?' అని ప్రశ్నించాడు శాస్త్రి.

'చూదురుగాని రండి!' అని ఆమె ముందునడువగా వెనకనే అతడు వెళ్లాడు.

రకరకముల చామంతి, గులాబిమొక్కలు పూలతో కలకల్లాడుతున్నాయి. వాటిని చూసేసరికి శాస్త్రికి అమితమైన ఆనందం కలిగింది. ఊగుతున్న కొబ్బరిమట్టలలోనుంచి రేగుతున్న చల్లనిగాలి ఎన్నిసార్లు సర్దుకుంటున్నా లక్ష్యపెట్టకుండా విశాలం ముంగురులనూ, పైటచెరగునీ ఊరికే చెదరగొడుతూంది. విశాలం పూలమొక్కల మధ్యనుంచి మెల్లగా సాగుతూంది. శాస్త్రి ఆమె అందాన్నే చూస్తూ పక్కనుంచి నడుస్తున్నాడు. ఆమె జుట్టుయొక్క సువాసనా, ఆ మెరిసే కళ్లూ, ఆపైటఎత్తులో దాగిఉన్న అందముయొక్క తలపూ అతణ్ణి వెర్రెత్తిస్తున్నాయి. ఇంతవరకూ ఎవరికాపుమీద వారున్నారు. కాని ప్రేమ ఎంతమధురమైందో అంత తీవ్రమైంది. దానిశక్తికి లొంగిపోకుండా ఉండడం ఎవరితరం? అతడలా చూస్తున్నకొద్దీ అతనికింకా దగ్గరగానూ, అతనికోసమై ఇంకా అందంగానూ ఉండాలనే అభిలాష ఆమెకు తీవ్ర మవుతూంది.

విశాలం చేతికందుబాటులోఉన్న రెండు గులాబీపూలుకోసి ఒకటి శాస్త్రికిచ్చి ఒకటి తనతలలో ఉంచుకుంది. ఇరువురూ గుబురుగా పెరిగిన జాజిపందిరికిందకు వెళ్లారు. విశాలం మెల్లగా అంటూంది: 'అబ్బ!...ఏమిటండీ ఆపనీ...' కాలం జరిగిపోయింది—

వారామూల విశ్రాంతికోసం కూర్చుని ఉంటారు. కూర్చోడమా! ఉత్తనేనా? ఆశ్చర్యకరమైన సంగతి. శాస్త్రి అంటున్నాడు: 'అబ్బాయిగారి డాబామీద ఎవరో ఉన్నట్లుంది!' ఆమెకుకూడా తెరచాపలలో ఎవరో మసులుతున్నట్లయింది. కాని అటువంటి అమూల్యమైన, అతిమధురమైన సమయంలో అటువంటివాటిని గురించి ఎవరు తలబెడతారు? ఆమె పూర్తిగా లొంగిపోయింది. చిరునవ్వుతో 'ఎవరూలేరు' అంది.

నాలుగుగంటలయింది. ఆమె చప్పున లేచింది. ఇరువురూ వెలుపలకు వచ్చారు. శాస్త్రి మందడిద్వారంతన్న తనబసకు వెళ్ళిపోయాడు. అతడప్పుడే వెళ్ళిపోవడం మంచిదయింది. విశాలం లోనికివచ్చిన రెండుమూడు నిముషాలలోనే భర్త తలుపుతట్టాడు. ఆమె తలుపు తెరిచింది. ఆమెచేతిలో ఏదో పత్రిక ఉంది. పాపం, ఇంట్లో ఒక్కర్తా ఉన్నందున ఏమీతోచక భర్తవచ్చేవరకూ దానిని చూసుకుంటూ కాలంవెళ్ళబుచ్చి ఉంటుంది!—

౬

శాస్త్రి వెళ్ళిపోతున్నాడు. అతడు వెళ్ళి

పోవాలని ఎంతో తొందరపడుతున్నాడు.

'ఒక్కరోజుండకూడదా?' అంది విశాలం.

ఊహు. అతనికి మరి ఆగడానికి అవకాశంలేదు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని అత డెంతో విసుక్కుంటున్నాడు.

'ఓస్! ఒక్కరోజుండమంటే ఉండకూడదా? నువ్వు వెళ్ళిపోతే నాకేమీతోచదు.' అంది విశాలం దీనంగా.

శాస్త్రికి మాటలకోసం తడుముకో నవసరంలేదు. చిరునవ్వుతో అన్నాడు: 'తోచకేం? అబ్బాయి ఉన్నాడు కాదూ?'

అబ్బాయి—! ఆమె కామాట కొంచెం కష్టంగా వినబడింది. అబ్బాయి సంగతి ఇతనికెలా తెలిసింది? ఆమె ఒక్కసారి తులుక్కుపడింది. కాని, అంతలోనే తేరుకుని అబ్బాయి విషయమై అతనికి కొంచెం అసూయకలిగించాలనే ఉద్దేశంతో 'అబ్బాయి ఉన్నాడులే—చాలా సందడిమనిషి. అతనిమాటలూ అవీ చాలా తమాషాగా ఉంటాయి—' అంటూండగానే 'సరేలే—ఇప్పు డతని ఊసెందుకు?' అన్నాడు శాస్త్రి.

అతని ధోరణిచూస్తే అబ్బాయి విషయమై అతడు ఈషత్తూ అసూయచెందినట్లుగాని, ఆ లక్ష్యమే అతనికున్నట్టుగాని కనబడలేదు. అది అతని సహృదయత్వంవల్లనో, గర్వంవల్లనో, లేక అబ్బాయినిగురించి అసూయపడేటంత మమకారం విశాలంయం దతనికి లేకపోవడంచేతనో నిర్ణయించడం కష్టం.

'పోనీ, ఈఒక్కపూటా ఉందూ! సరదాగా గడుపుదాము!' అంది విశాలం తిరిగి దీనమైన స్వరంతో.

ఊహు. అతడు ఒక్కపూటకూడా మరి ఉండలేదు.

బహుశా శాస్త్రి ఇప్పటికి ఈ ఆటతో విసువెత్తి ఉంటాడు. మొదటిచూపులోనే విశాలాన్ని ఆకర్షించి సుమారు రెండు వారములు ఆమెను కేవలం తనదానినిగా చేసుకుని ఆమెతో తన ఇష్టమువచ్చినట్లు హాయిగా గడిపాడు. అతడు కోరిందంతే. అంతకంటె ఆమెతో కొసాకూ ఇక్కడ ఆడుకుంటూ కూర్చుండికి అతని కవకాశంలేదు. అదే అతని ఆశయంకాదు. ఒకస్త్రీకోసం దేవులాడుతూ కూర్చోడంకంటె అతడు చేయవలసిన ముఖ్యమైన పనులెన్నో ఉన్నాయి.

కాని విశాలానికి తగనిధైర్యం వస్తున్నట్లుంది. ఇప్పుడామె దేన్నిగురించీ ఆలోచించలేదు. ఏలక్ష్యమూ ఆమెకున్నట్లు కనబడదు. వారిరువురకూ ఉన్న సంబంధం ఎంతోకాలం దికాకపోవచ్చును. కాని శాశ్వతమైనదిగా ఉండడానికి తగినంత గాఢంగా ఆమె హృదయంలో హత్తుకుపోయింది.

'అబ్బ! ఈపూట నిన్ను వెళ్ళనీయను' అని అతనిచేయి గట్టిగా పట్టుకుంది. 'తనకు అధికారముందా, ఇది చేయవచ్చునా, కూడదా?' అనే ఆలోచనే ఆమె కప్పుడు లేదు. ఎవరైనాచూస్తే? భర్తచూస్తే... లేక తెలుస్తే?—తల పగిలిపోతుంది! అయితేనేం? ఆమె కాలక్ష్యమేలేదు. కాని ఆమె తనవేళ్ళకింద అతని అయిష్టతను గ్రహించి ఉంటుంది. మెల్లగా చేయి వదిలింది.

అతడు తొందరగా 'నేనువెళ్తాను మరి—వేళవుతూంది; ఇంకా సామానూ అదీ సర్దుకోవాలి' అంటూ కదలిపోయాడు.

అతడు వెనకటింటి ముందరిచీడీలో సామాను సర్దుకుంటూ ఉంటే మండడిద్వారంలో నిలుచున్న విశాలంవక్షం తీవ్రంగా కొట్టుకుంటూంది. ఆమె అతనివంకే చూస్తూంది.

అతడుకూడా తనవంకే చూస్తున్నందున వెళ్ళిపోయేముందు మరోసారి తనచెంతకు వస్తాడని ఆమెనమ్మకం. వస్తే అతనికేదో చెప్పాలనో, లేక జ్ఞాపకచిహ్నంగా ఏదేనా బహుమతీ ఇవ్వాలనో ఆమెకోరిక—కాని అతడు మరి రాలేదు. అక్కణ్ణించే చిరునవ్వుతో తన కృతజ్ఞతను తెలియచేసి వెళ్ళిపోయాడు.

ఆమె అక్కడే నిలబడిపోయింది—

కొంతసేపటికి తేరుకుని మెల్లగా ఇంట్లోకి వెళ్ళింది. మంచంపైని వ్రాలి వెక్కివెక్కి ఏడ్చింది. ఎంతో బాధ పడింది.అయినా తనని తప్ప ఎవరినీ ఆమె నిందించలేదు. ఆమె మనస్సు పశ్చాత్తాపంతో, దుఃఖంతో ఇంకా తీవ్రంగా బాధపడుతూంది—తనపాపానికి ఏమిటి పరిహారం? తనసంగతంతా భర్తతో స్పష్టంగా చెప్పివేస్తే తనమనస్సుకి శాంతి కలుగవచ్చును. కాని ఎలాచెబుతుంది? చెబితే ఏమైనా జీవముంటుందా? చెప్పలేదు. కాని చెప్పకపోయినంతమాత్రాన లోపమేమిటి?—ఆమె హృదయంలో పరివర్తనం కలిగింది; ఆమె ప్రవర్తనలో పూర్తిగా మార్పు వచ్చింది.

ఇప్పుడు భర్తను భోజనానికి లెమ్మనవలసివస్తే వంటింటిలోనుంచి కేకవేయదు. దగ్గరకువెళ్ళి తొల్లింటివలెనే ఎంతో మర్యాదగా, ఆప్యాయంగా స్నానానికి లెమ్మని చెబుతుంది. అతడు లేచేసరికి స్నానానికి వేడినీళ్లూ, పీటా, సబ్బుబిళ్లా, తువ్వాలూ అన్నీ సిద్ధంగా అమరుస్తుంది. స్నానానంతరం అద్దం, దువ్వెనా, అంగారు, పట్టుపంచ అన్నీ క్రమంగా తనే అతని కందిస్తుంది. అతడు ఆఫీసుకు వెళ్లేసమయాన అతనిదుస్తులు తనేతీసి అతనికిచ్చి, తిరిగి అతడు ఇంటికి రాగానే వాటిని తనే పుచ్చుకుని జాగ్రత్త పెడుతుంది. అయినా ఆమెకు సంతుష్టికలుగలేదు.

ఒకరోజున రాత్రి రెండుగంటలవేళ విశాలం మేలుకుని భర్తను మెల్లగా పిలిచింది—

'ఏమండీ, పడుకున్నారేమిటి?'

విశ్వనాథం పక్కమీదనుంచి లేచి 'ఏమీ?' అన్నాడు.

'ఏమీలేదు; నాకేమో తోచకుండా ఉంటే పిలిచాను.'

అతడు దగ్గరకువచ్చి కూర్చున్నాడు. ఇరువురూ ఏవో మాట్లాడుకుంటున్నారు—

ఇంతకూ విశాలం సాటిలేని యువతి: ఆమె సంపూర్ణమైన హృదయంతో అంది: 'ఏమండీ, నేను మీఎడల ప్రవర్తించవలసిన విధంగా ప్రవర్తించలేదుకదూ?...నాకు చాలా విచారంగా ఉంది.'

అమాయకములైన ఆమాటలు అతణ్ణి కదిలించాయి. ఆమె ఉద్దేశమేమో గ్రహించకుండానే ఆమెను ఓదార్చాలని అతనికి బుద్ధి పుట్టింది—'అదేమిటి? విశాలం, ఆమాటలు! నువ్వేం తప్పుచేశావు? నీవంటివారెవరున్నారు! నువ్వు నాకు లభించినందున నిజంగా నేనెంత అదృష్టవంతుణ్ణి!' అన్నాడు.

విశాలం కళ్ళలో కృతజ్ఞత తాండవించింది. ఆమె మనసులోని బాధ పూర్తిగా తొలగిపోయింది. ఆమె రోజురోజుకీ ఎంతో నెమ్మదిగా, మంచిగా మారిపోతూంది. గృహకృత్యములయందు, భర్త సంరక్షణయందు ఎంతో శ్రద్ధవహిస్తూంది. భర్తను సర్వోత్కృష్టునిగా తెలుసుకుంది. మనసులోనైనా అతణ్ణిదప్ప ఇంకెవరినీ ఇప్పుడామె కోరలేదు. అతని చూపుల్లోనూ, చేష్టల్లోనూ నాగరికతా, రసికతా గోచరించకపోవచ్చును—కాని ఎంత అమాయకుడు, ఎంత ఉదారుడు!

పవిత్రత కేవలం సహించదగ్గదేగాక, అవసరమైందికూడానని అనుభవపూర్వకంగా మరోసారి తెలుసుకోబడింది.